# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

కవి గాయకుడు, రచయిత, నటకుడు

## విద్వాన్ కణ్వశ్రీ

### (1959 సినిమారంగం పత్రిక నుంచి)

**రాళ్ళలో రత్నాలు,** రత్నాలలో రాళ్ళు, ఏవి రాళ్ళో, ఏవి రత్నాలో కనిపెట్టడం కష్టం. రత్నమే ఒకప్పుడు మట్టితో కప్పబడి పనికిరాకుండా పడి వుంటుంది. దాన్ని మన కాలికిందే నలగ దొక్కుకుంటూ పదే పదే నడుస్తూ వుంటాం. కాని, దాన్ని కనిపెట్టలేం. నిజానికి రాయే ఒకప్పుడు రత్నంగా ముస్తాబై మన నెత్తికెక్కుతుంది. దానికే బ్రహ్మ రథం పడతాం. ఈ మంచి చెడ్డల్ని నిర్ణయించడం మనవల్లకాదు, కాలమే నిర్ణయించాలి. కవిత, వనిత, లత ఈ మూడూ ఆశ్రయం లేనిదే రాణించవంటారు. కవికి ఆశ్రయం దొరికినప్పుడే ఆ ఆధారంతో ఉన్నతోన్నతమైన అభ్యుదయాన్ని అందుకోగలడు. అది లేనినాడు కవి మహాపండితుడైనా, మేధావంతుడైనా రాణించలేడు. భోజరాజు లేకపోతే కాళిదాసు అంత గొప్పవాడయ్యేవాడు కాదేమో!



అలా ఇంతవరకూ మసక మసకన చీకట్లో ఉండి యిప్పుడే వెలుగులోనికి వచ్చినవారే విద్వాన్ కణ్వశ్రీగారు. జయప్రదంగా 15 ఏళ్ళనుంచీ నాటక రచన సాగిస్తూ ఆంధ్ర ప్రజానీకానికి చిరపరిచితుడైన ప్రతిభావంతులు. నాటక రంగం మీద నవోదయాన్ని సాధించాలని, కొత్త పంథాలో కృషి చేస్తున్న మహాకవుల్లో కణ్వశ్రీగారొకరు. ఈయన తొలిసారిగా 'ఇదా ప్రపంచం?' అంటూ ఎలుగెత్తి ప్రశ్నించారు ఒక నాటకంలో.

మరొక నాటికలో 'ఆనాడు' అంటూ ప్రారంభించి దేశానికి ఒక కథ చెప్పి మేలుకొలిపారు. మరొక దానిలో బాలనాగమ్మ దుఃఖ గాథను హృదయరంజకంగా గానం చేసి అజాత శత్రువయ్యారు. వీరి రచనలన్నీ తెనుగు ప్రజల్ని అద్భుతంగా ఆకర్షించిన కళాఖండాలు. ఇంతేకాదు. ఈయన రసవత్తరమైన కవిత్వం చెప్పగల ప్రజ్ఞాశాలి. మృధు మధురమైన కంఠం. చక్కని సంగీతజ్ఞానం కలవారు. వారి పద్యాలూ, పాటలూ వారే పాడి వినిపిస్తున్నప్పుడు శ్రోతల హృదయాలు ఉర్రూతలూగిపోతాయి. కలంలోనేకాక కంఠంలోకూడా రసావేశాలు ఒలికించగలరు. ఒకప్పుడు వీరు 'అదృష్టదీపుడు' చిత్రానికి సూర్యకుమారి, జిక్కి ప్రభృతుల్తో కలిసి కొన్ని ప్లేబ్యాక్ పాటలు పాడారు. దేవుడు శ్రావ్యమైన కంఠమిచ్చాడు. కాని దాన్ని ఉపయోగించుకోవడం వీరికి ఇష్టంలేదు.

మరో ముఖ్య విషయం. నటనలో వీరిది అందెవేసిన చెయ్యి. 15 సంవత్సరాల సంపూర్ణానుభవం కలవారు. అందువల్లనే వీరు వ్రాసే ప్రతి డైలాగులోనూ ఆ నటనానుభవం ప్రత్యక్షంగా కనిపిస్తూ వుంటుంది. డైలాగును ఎక్కడికి తుంచితే రక్తికడుతుందో, ఎక్కడ పొడిగిస్తే రసోత్పత్తి జరుగుతుందో, ఎలా ఉచ్చరిస్తే అందులో నుండి జీవం వెలువడుతుందో యీ సూక్ష్మ దృష్టి వీరికి జన్మతో వచ్చింది. అది సాధనతో అలవడేది కాదు. నాటక రంగంలోగాని, సినిమా రంగంలోగాని ఇలాంటి బహుముఖ ప్రజ్ఞావంతులైన కవులు అరుదు. ఒకరిద్దరికంటే ఎక్కువగా చూడలేం. కాని వీరిలో కూడా చంద్రుడిలో మచ్చలాగా ఒక లోపముంది. ఎవరినీ యాచించరు. తన గొప్ప చెప్పుకోరు. ఆత్మాభిమానం ఎక్కువ. ఈ సద్గుణాలు సినిమా రంగానికి పనికిరావు. అయినా శర్వాణీ పిక్చర్సు నిర్మాత శ్రీ గోపాల రెడ్డిగారు ఈ రత్నాన్ని పసికట్టారు. ప్రస్తుతం వీరు 'చందమామ రావే, జాబిల్లి రావే' అనే జానపద చిత్రాన్ని కణ్వశ్రీగారి సోదరుడు శ్రీ గోపీనాథ్ దర్శకత్వం క్రింద నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కణ్వశ్రీగారే మాటలు, పాటలు వ్రాస్తున్నారు. ఇది శ్లాఘించ దగ్గ విషయం. వీరి కలంనుండి ఇతోధికంగా చిత్రాలు రావాలని, కావాలని తెలుగుదేశం ఎదురు తెన్నులు చూస్తోంది .

Post your comments